ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 24 ఫిబ్రవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు


గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 19.4

యాదగిరీశుడి గోపురం స్వర్ణ శోభితం

వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు



యాదగిరిగుట్ట ప్రధాన ఆలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులకు ఆశీర్వచనం అందజేస్తున్న ప్రధాన అర్చకుడు నల్లన్‌థిఘల్ లక్ష్మీనర్సింహచార్యులు, చిత్రంలో సీఎస్ శాంతికుమారి, కలెక్టర్ హనుమంతరావు

దేశంలోనే మొట్టమొదటి ఎత్తయిన స్వామివారి విమానగోపురం స్వర్ణమయమై దర్శనమిచ్చింది. 68 కిలోల బంగారంతో తయారు చేసిన విమాన గోపురం చూసేందుకు చూడముచ్చటగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గీత దంపతులు ఆదివారం లక్ష్మీనరసింహస్వామి స్వర్ణ దివ్య విమాన గోపురం మహాకుంభాంభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. సంప్రోక్షణకు ముందే ఐదురోజులుగా వేదమంత్ర పఠనాల నడుమ మహాకుంభాభిషేక పూజలు కొనసాగాయి.

-(ఆంధ్రజ్యోతి-భువనగిరి అర్బన్)

బంగారు విమాన గోపురానికి నమస్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

యాదగిరికొండపై బంగారు విమాన గోపురం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి సన్నిధిలో స్వర్ణ దివ్య విమాన రాజగోపురం ఆదివారం ఆవిష్కృతమైంది. గత ఐదు రోజులుగా రుత్వికులు, అర్చక బృందం హవనాలు, జపాలు, పారాయణాలు, వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ వేడుకను వైభవంగా నిర్వహించారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, గీత దంపతులు చేతుల మీదుగా మహాకార్యం విజయవంతమైంది. వానమామలై మఠం 31వ మధురకవి పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. జీయర్ అనుమతితో మహాకుంభ కలశం ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు నెత్తిన మోస్తూ ఐదు అంతస్తుల (50.5 చదరపు అడుగులు) ఎత్తులోని స్వర్ణ గోపురం సుమారు 126 మెట్లెక్కారు. ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు అర్చకత్వంలో మహాకుంభాభిషేక సంప్రోక్షణ చేశారు.

ఈ వేడుకల్లో భాగమయ్యేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డుమార్గం ద్వారా ఉదయం 11.09 గంటలకు యాదగిరిగుట్ట వైకుంఠద్వారం వద్దకు చేరుకున్నారు. కొండపైకి చేరుకున్న సీఎం అతిథి గృహంలో సాంప్రదాయ దుస్తులు ధరించి లిఫ్ట్ ద్వారా ఆలయ ఉత్తర తిరువీధిలోని యాగశాలలో నిర్వహించిన మహాపూర్ణాహుతిలో 11.22 నుంచి 11.27 గంటల వరకు పాల్గొన్నారు. అక్కడి నుంచి ఉత్తర రాజగోపురంనుంచి దక్షిణ భాగం మెట్ల ద్వారా 11.31 గంటలకు స్వర్ణ గోపురం వద్దకు వెళ్లారు. అదే సమయంలో సీఎం వెనకాల రామానుజ జీయర్ ఆజ్ఞానుసారం మహాకుంభంతో ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు నెత్తిన ఎత్తుకొని 126 మెట్లెక్కి సంప్రోక్షణలో పాల్గొన్నారు. స్వర్ణమయ...

- మిగతా 7వ పేజీలో...



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు



హాజరు కోసం తిరగాల్సిందే!

- లేదంటే హాజరు.. గైర్హాజరే ?
- ఎన్‌ఎంఎంఎస్‌లో హాజరుకు కొత్త విధానం
- ప్రతీ రోజు రెండు పర్యాయాలు ఫొటో దిగాల్సిందే

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీ పనంటే ఏముందీ... ఓ రెండు గంటల పాటు పనిచేసి వస్తే సరిపోద్దనే రోజులు మారాయి. గతంలో మాదిరిగా నిర్ణీత కొలతలో ఇచ్చిన పనిని ఓ రెండు గంటల్లో పూర్తి చేసి ఇంటికి వెళ్తామంటే కుదరదిక. కనీసం పని ప్రదేశంలో నాలుగు గంటలైనా ఉండాల్సిందే. అంతేనా.. చేసిన కూలీ పనికి ఆ రోజు హాజరు పడాలంటే పని ప్రారంభ ప్రదేశానికి ప్రతీ రోజూ వెళ్లాల్సిందే. అదీ ఒకసారే కాదు. రెండు సార్లు వెళ్లి ఫొటోలు దిగాల్సిందే. లేదంటే హాజరు గైర్హాజరే!. ఇది ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన కొత్త విధానమట. ఈ పద్ధతి అమలుతో ఉపాధి కూలీలకు హాజరు తిప్పలు తప్పడంలేదు. కొన్ని ఉపాధి పనులకు ఈ విధానంపై మినహాయింపు ఇచ్చినా అమలు చేయాల్సిన పనుల్లో మాత్రం హాజరు కోసం కూలీలు, సాంకేతిక సమస్యతో 'క్షేత్ర' సహాయకులూ ఇబ్బందిపడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో పారదర్శకత పేరుతో ఈ తరహా తీసుకువస్తున్న సంస్కరణలు పథకం అమలులో అసౌకర్యంగా మారాయి.

గతంలో అలా

ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు ఓవర్క్ ఐడీ ఇచ్చే వారు. ఆ వర్క్ ఐడీకి సంబంధించిన ప్రదేశాల్లో ప్రతీరోజూ ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ఫొటోలను ఆ శాఖ ఇచ్చిన స్మార్ట్ ఫోన్ యాప్ ద్వారా ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం)కు క్షేత్ర సహాయకులు పంపేవారు. దీంతో పని ప్రదేశానికి సంబంధించిన ఫొటో అప్‌లోడ్‌తో కూలీల హాజరు జనరేట్ అయ్యేది. పని పూర్తయ్యే వరకు ప్రతీరోజూ నిర్ణీత ప్రదేశంలో ఏదో ఒక చోటనుంచి రెండుసార్లు కూలీల ఫొటోలు పంపే విధానం ఉండేది.

ఇప్పుడు ఇలా

భువన్ యాప్ ద్వారా తొలుత పని గుర్తించి పంపుతారు. ఆ పని మంజూరైన తర్వాత వర్క్ ఐడీ జనరేట్ అవుతుంది. అయితే గతంలో....

- మిగతా 6వ పేజీలో...

విస్తరించని అరణ్యం

- నల్లమలకే పరిమితమైన అటవీ ప్రాంతం
- హరితహారం, వనమహోత్సవంతో ప్రయోజనమేదీ?
- అటవీయేతర ప్రాంతాల్లో పెరగని వృక్ష సంపద

వాతావరణ సమతుల్యాన్ని సంరక్షించడంలో వనాల ప్రాధాన్యత ఎనలేనిది. భారీగా వర్షాలు కురవాలంటే వృక్ష సంపద పెరగడం, లేదంటే అరణ్యాలే ఆధారమవుతుంటాయి. అడవులు పెరగడం వల్ల జీవరాశుల మనుగడ కూడా ఎంతగానో ఉంటుంది. గత పదేళ్లలో అప్పటి ప్రభుత్వం హరితాహారం కింద మైదాన ప్రాంతంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలు, పరిశ్రమలు, ఇతర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. అయితే ఇందులో నూటికి నూరుశాతం మొక్కలు బతికింది లేదు. మొక్కలు ప్రతి ఏటా వర్షకాలం ప్రారంభంలో మినహా వాటి సంరక్షణకు బాధ్యతలు చేపట్టక పోవడంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయింది తప్ప మొక్కల ఎదుగుదల పూర్తి స్థాయిలో లేదన్న విమర్శలున్నాయి.


- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

మానవ ప్రమేయం లేకుండా ప్రకృతిలో పుట్టి, పెరిగే మొక్కలు, చెట్లు, గడ్డిపొదలు, సహజ సంపద వల్ల నల్లమల అటవీ ప్రాంతం విస్తరించింది. ప్రధానంగా దేవరకొండ నియోజకవర్గం నుంచి మొదలుకొని కృష్ణా పరివాహక ప్రాంతంలో దట్టమైన అడవి భూభాగం ఉంది. అటవీ విస్తీర్ణం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లేకపోవడంతో హరితాహారం ద్వారా ఆ లోటును పూర్తి చేయాలని గత ప్రభుత్వం భావించినప్పటికీ వృక్ష సంపద విస్తరించలేదు. చాలాచోట్ల అనధికారికంగా అడవుల నరికివేత ఉండటం వల్ల వృక్ష సంపద తరిగిపోతుంది. హరితహారం కింద పెట్టిన మొక్కలు వీధుల్లో కరెంట్ వైర్ల కింద పెట్టడంతో అవి పెరిగినప్పుడల్లా కొమ్మలతోపాటు ఒక్కొక్కసారి మొదళ్ల వరకు నరికివేస్తున్నారు. వాస్తవానికి వాతావరణ సమతుల్యంకోసం అడవుల విస్తీర్ణం 33శాతం పెంచాల్సిన అవసరం ఉంది. హరితహారం, వనమహోత్సవాల కింద ప్రతి సంవత్సరం జూలైలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా ఉపయోగం లేకుండా పోతుంది. ప్రత్యేక రాష్ట్రమేర్పడిన తర్వాత 2015లో గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మొక్కలను అటవీయేతర ప్రాంతాల్లో పెంచే ప్రయత్నాలకోసం ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్రంలో అటవీ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న జిల్లాలు అదిలాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రాంతాలు మొదటి స్థానాల్లో ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా కేవలం నల్లమల అటవీ ప్రాంతంపైనే ఆధారపడి ఉండటంతో అటవీ విస్తీర్ణంపై నీలినీడలు అలుముకున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 65వేలకు పైగా హెక్టార్లలో..

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 65వేలకు హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో దేవరకొండ నియోజకవర్గం సరిహద్దుల్లో అటవీ ప్రాంతం ఉంది. కృష్ణా పరివాహక ప్రాంతం ఇటు నల్లగొండ సరిహద్దుల్లో ఉన్న ప్రాంతంలో అడవులు విస్తరించి ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో రాచకొండ గుట్టల్లో మాత్రమే కొంతమేరకు అటవీ ప్రాంతం ఉండగా, సూర్యాపేట జిల్లాలో అటవీ ప్రాంతం అంతంత మాత్రమే. ఉమ్మడి జిల్లాలో 33శాతం మేరకు అటవీ విస్తీర్ణం పెంచడంకోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొక్కలు పంపిణీ చేయడం మినహా సంరక్షణ కోసం ఏ మాత్రం చర్యలు చేపట్టకపోవడంతో వేసిన మొక్కలు వేసినట్లే ఎండిపోగా కొన్నిచోట్ల పెరిగిన చెట్లు రోడ్ల విస్తరణలో కొట్టేయడం, కొన్ని చోట్ల పంపిణీ చేయకుండానే నర్సరీలోనే మొక్కలు ఎండిపోయాయి. గత నాలుగేళ్ల క్రితం 8.52శాతం మేరకు అటవీ విస్తీర్ణం ఉండగా ప్రస్తుతం 9.13శాతం మేరకు అటవీ విస్తీర్ణం పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. అటు దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. మిగతా ప్రాంతాలపై అధికారులు, ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. కేవలం సహజంగా ఉన్న అటవీ సంపద గురించి మాత్రమే అధికారులు చెబుతున్నారు తప్ప పెంచిన వృక్ష సంపద ఎంతని చెప్పలేకపోతున్నారు. 2013లో ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా ఉపగ్రహ కొలతల ప్రకారం గత కొన్నాళ్ల వరకు 8.52శాతం ఉండగా...

- మిగతా 6వ పేజీలో...





చౌటుప్పల్ పట్టణంలో వెలవెలబోతున్న చికెన్ దుకాణం

చికెన్ దుకాణాలు వెలవెల

- బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్ధారణతో విక్రయాలపై ప్రభావం
- అరగంటలో 200 కిలోల చికెన్ పకోడీ ఖాళీ

చౌటుప్పల్ మండలంలోని నేలపట్లలో బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్ధారణ కావడంతో చికెన్ విక్రయాలపై తీవ్ర ప్రభావం పడింది. నేలపట్ల గ్రామానికి చుట్టుపక్కల 10కిలోమీటర్లు అంటే అటు వలిగొండ, ఇటు చౌటుప్పల్ పట్టణాల వరకు బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రభావం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోనే మొదటి బర్డ్ ఫ్లూ వ్యాధి నిర్ధారణ ఈ మండలంలోనే జరగడంతో చౌటుప్పల్ పట్టణంలోని చికెన్ దుకాణాల్లో ఆదివారం విక్రయాలు ఒక్కసారిగా పడిపోయాయి.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



ప్రవేశ పరీక్షను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన టీజీసెట్-2025 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ ఇలాత్రిపాఠి తెలిపారు. ఆదివారం ఆమె జిల్లాకేంద్రంలోని చర్లపల్లి బైపాస్ వద్ద ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన టీజీసెట్ ప్రవేశ పరీక్షను తనిఖీ చేశారు. ప్రవేశ పరీక్షకు మొత్తం 12,929 మంది విద్యార్థులను కేటాయించగా, పరీక్షకు 12,503 మంది విద్యార్థులు హాజరయ్యారని, 426 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. 96.71శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు కలెక్టర్ వెల్లడించారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.

హైవేలపై వారాంతపు రద్దీ



గూడూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

బీబీనగర్, చౌటుప్పల్ టౌన్, కోదాడ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హైదరాబాద్ -వరంగల్ 163వ జాతీయ రహదారిపై ఆదివారం వారాంతపు సెలవు రద్దీ కనిపించింది. మహాశివరాత్రి పర్వదినంలోగా దైవ దర్శనాలు చేసుకుంటే శుభం కలుగుతుంది అన్న బావన ప్రజల్లో ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వేలాది ప్రజలు యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి, భువనగిరిలోని స్వర్ణగిరి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాల దర్శనార్థం వాహనాల్లో వేలాదిగా తరలి వచ్చారు. దైవ దర్శనాల అనంతరం ప్రజలంతా హైదరాబాద్ వైపు తిరుగు ప్రయాణం కావడంతో సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 9గంటల వరకు హైదరాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారి రోడ్డు మార్గం వాహనాలతో రద్దీగా మారింది. దీంతో బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సాధారణ రోజుల్లో కంటే ఆదివారం సెలవు దినాన సుమారు 3వేల నుంచి 5వేల వాహనాలు అదనంగా రాకపోకలు కొనసాగించి ఉంటాయని టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపారు. సుమారు కిలో మీటరు వరకు వాహనాలు నిలిచిపోవడంతో వాహనాదారులు కొంత అసహనానికి గురయ్యారు. చౌటుప్పల్ పట్టణంలోని 65 వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి వాహనాల రద్దీ కనిపించింది. కోదాడ నుంచి హైదరాబాక్‌కు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బస్సులు లేనందున ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు రూ. 500 నుంచి రూ.1000 వసూలు చేశారు. రూపాయల వరకు వసూలు చేశారు.ఈ విషయంపై ఆర్టీసీ డీఎం హర్షను వివరణ కోరగా, ఆదివారం ప్రయాణికుల రద్దీ ఉండడం సర్వసాధారణమన్నారు.

పరిహారం ఇచ్చి పనులు చేసుకోండి



లక్ష్మాపురం ప్రాజెక్టు వద్ద పనులను అడ్డుకున్న భూ నిర్వాసితులు

నాంపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగోటం గ్రామపంచాయతీ పరిధిలో గల లక్ష్మాపురంలో నిర్మిస్తున్న లక్ష్మీపురం ప్రాజెక్టు భూ నిర్వాసితులు ఆదివారం పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వం నిర్మించే ప్రాజెక్టులు తమ భూములను ఇళ్లను సర్వస్వం కోల్పోతున్న ప్రభుత్వం తమకు ఇచ్చే నష్టపరిహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ప్రభుత్వం అందించే ఆర్అండ్ఆర్ కాలనీ ఇప్పటికి నిర్మించలేదని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదని, కొంతమంది రైతులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చిన వారికి డబ్బులను అందజేయలేదన్నారు. 2017 సంవత్సరంలో చనిపోయిన రైతులకు ఇప్పటి వరకు ఆర్అండ్ఆర్ అందలేదని గ్రామంలో ఉన్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తమకు పరిహారం ఇవ్వకుండా పనులు చేస్తే ఊరుకునేదిలేశని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో లక్ష్మణాపురం గ్రామస్థులు పాల్గొన్నారు.

కబడ్డీ బాలుర విభాగంలో విజేతగా నల్లగొండ జట్టు



నల్లగొండ బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 34వ సబ్ జూనియర్ అంతర్ జిల్లా కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌కు హాజరైన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సమానమన్నారు. ఈ పోటీల్లో 33 జిల్లాల నుంచి 960 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో భద్రాద్రి కొత్తగూడం జిల్లా జట్టు తొలి స్థానంలో నిలువగా రంగారెడ్డి జిల్లా రన్నరప్‌గా నిలిచింది. కాగా వారికి స్పీకర్ ట్రోఫీ అందజేశారు. బాలుర విభాగంలో నల్గొండ జట్టు విజేతగా నిలవగా నాగర్ కర్నూల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. క్రికెట్ వలంటీర్స్ టీం సహకారంతో ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వినోద్ ముదిరాజ్ తెలిపారు. ఈ వేడుకల్లో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, జిల్లా కబడ్డీ అధ్యక్షుడు పరుశురాంనాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాలే లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు క్రీడాకారులు, కోచ్‌లు, యువతి యువకులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 23(ఫిబ్రవరి): భార్య కాపురానికి రావడం లేదని భర్త ఉరి వేసుకుని మృతిచెందిన సంఘటన మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన నక్క వెంకన్న(35) భార్య సరితకు 14ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి పాప, బాబు సంతానం ఉన్నారు. రెండు సంవత్సరాలుగా భార్య కాపురానికి రావడం లేదు. పలుమార్లు బతిమిలాడినా రాకపోవంతో శనివారం ఇంట్లో ఉన్న బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని మృతిచెందాడు. తన కుమారుడి మృతికి కారణం భార్య సరిత, ఉరిబండి మల్లయ్య, మాన్యం శ్రీనులని పోలీసులకు మృతుడి తండ్రి చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు..

ఆస్పత్రుల భాగస్వామి బలవన్మరణం

వనస్థలిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో పలు ఆస్పత్రుల్లో భాగస్వామి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా, మిర్యాలగూడ సమీపంలోని శెట్టిపాలెంకు చెందిన బంటు నగేష్(47) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి మన్సూరాబాద్ ప్రగతినగర్‌లో నివసిస్తున్నాడు. ఇతడి భార్య పేరుగాంచిన ప్రైవేట్ ఆస్పత్రిలో ఫార్మాసిస్టుగా పనిచేస్తోంది. నగేష్ ఎల్బీనగర్‌లో పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో భాగస్వామి. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు లుంగీతో ఉరేసుకున్నాడు. బయటకు వెళ్లిన భార్య, ఇద్దరు పిల్లలు తిరిగి ఇంటికి వచ్చేసరికి నగేష్ ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకుని సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. నగరానికి చెందిన పలువురి వద్ద అవసరానికి ఇళ్ల స్థలాలను జీపీఏ చేసి డబ్బులు తీసుకున్నాను. డాక్యుమెంట్లు తిరిగి ఇస్తే స్థలాలను విక్రయించి డబ్బులు చెల్లిస్తానని సదరు వ్యక్తులకు పలుమార్లు విన్నవించిన వారు వినలేదు. ప్లాట్లను తిరిగి ఇవ్వకపోవడంతో మనస్తాపంలో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అందులో రాశాడు. తన మరణానికి కారణమైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, భార్య, ఇద్దరు పిల్లలకు న్యాయం చేయాలనీ నగేష్ సూసైడ్ నోట్‌లో రాసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ దుకాణాలు వెలవెల

● బర్డ్ ఫ్లూ వ్యాధి నిర్ధారణతో విక్రయాలపై ప్రభావం



బర్డ్‌ఫ్లూ కారణంగా పట్టణంలో బంద్ చేసిన దుకాణం

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలంలోని నేలపట్లలో బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్ధారణ కావడంతో చికెన్ విక్రయాలపై తీవ్ర ప్రభావం పడింది. నేలపట్ల గ్రామానికి ఎటూ 10కిలోమీటర్లు అంటే అటు వలిగొండ, ఇటు చౌటుప్పల్ పట్టణాల వరకు బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రభావం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోనే మొదటి బర్డ్ ఫ్లూ వ్యాధి నిర్ధారణ ఈ మండలంలోనే జరగడంతో చౌటుప్పల్ పట్టణంలోని చికెన్ దుకాణాలలో ఆదివారం అమ్మకాలు ఒక్కసారిగా పడిపోయాయి. సంత రోజైన ఆదివారం కొనుగోలు దారులతో ఎంతో రద్దీగా ఉండే చికెన్ దుకాణాలు వ్యాధి ప్రభావంతో వెలవెలబోయాయి. చికెన్ దుకాణాల వైపు ప్రజలు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి నెలకొంది.

అరగంటలో 200కిలోల చికెన్ పకోడీ ఖాళీ



భువనగిరిలో ఉచిత చికెన్ పకోడి కోసం బారులు తీరిన చికెన్ ప్రియులు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మాంసాహార ప్రియులు, చికెన్ విక్రయదారులకు బర్డ్ ఫ్లూ వణుకు పుట్టిస్తుండగా చికెన్ విక్రయాలు గణనీయంగా తగ్గాయి. ఫలితంగా పౌల్ట్రీ ఫాం నిర్వాహకులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఈ ప్రభావం కోడి గుడ్ల విక్రయాలపైనా పడింది. మార్చి 2 నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న బర్డ్ ఫ్లూ భయాన్ని పారదోలే లక్ష్యంతో 'చికెన్‌తో ఎలాంటి భయము లేదు.. వ్యాధులు రావు... శుభ్రంగా ఎప్పటిలాగే చికెన్ వంటకాలను తినవచ్చు'నంటూ ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన అస్మా పౌల్ట్రీ ఫార్మ్ భువనగిరిలోని పలు ప్రాంతాల్లో 200కిలోల ఉచిత చికెన్ పకోడిని పంపిణీ చేసింది. ఇందుకోసం ముందస్తు ప్రచారం నిర్వహించింది. దీంతో బర్డ్ ఫ్లూపై భయం నెలకొన్న ప్రచారాన్ని తలదన్నుతూ ఉచిత చికెన్ పకోడీ కోసం ఏర్పాటుచేసిన నాలుగు పంపిణీ కేంద్రాల ముందు మొత్తం 1500మంది బారులు తీరారు. అంచనాకు మించి చికెన్ ప్రియులు చికెన్ పకోడీ కోసం ఎగబడటంతో పోలీసుల సాయంతో పౌల్ట్రీ ఫాం సిబ్బంది అరగంటలో పంపిణీని పూర్తి చేసింది.

చుట్టు పక్కల గ్రామాల్లో భయాందోళన

మండల పరిదిలోని నేలపట్ల గ్రామ సమీపంలోని ఒక కోళ్ల ఫారంలో 10 రోజుల క్రితం బర్డ్ ఫ్లూ వ్యాధితో సుమారు 1000బ్రాయిల్ కోళ్ల మృతి చెందినట్టు ల్యాబ్ పరీక్షలలో నిర్ధారణ జరిగింది . ఈ గ్రామానికి సమీపంలోని ఎస్.లింగోటం గ్రామంలో సైతం మూడు కోళ్ల ఫారాల్లో సుమారు ఆరు వేల బ్రాయిలర్ కోళ్ల మృతి చెందడంతో భూమిలో పాతి పెట్టారు. వీటితో పాటుగా ప్రాణాలు ఉన్న సుమారు 13వేల కోళ్లను సైతం గుంతలలో పూడ్చివేశారు ఈ ఘటనల మూలంగా చుట్టు పక్కల గ్రామాలలోని ప్రజలలో తీవ్ర భయందోళనలు అలముకున్నాయి. చికెన్ తిని ప్రాణాల మీదకు తెచ్చుకునే కంటే కొద్ది రోజుల పాటు మాంసహారానికి దూరంగా ఉండడమే అన్ని విధాలుగా శ్రేయష్కరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఈ గ్రామాలకు 10 కిలోమీటర్ల దూరం వరకు..

మండల పరిదిలోని నేలపట్ల ,ఎస్. లింగోటం గ్రామాలకు ఎటు 10 కి. మీటర్ల వరకు బర్డ్ ఫ్లూ పభ్రావం ఉంటుందని, ఈ పరిధిలోని కోళ్లకు తగిన పరీక్షలను నిర్వహించేందుకు యజమానులు, నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఈ ప్రభావం అటు వలిగొండ, ఇటు చౌటుప్పల్ పట్టణం వరకు ఉంటుందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. పట్టణంలో కొనుగోలుదారులతో కిటకిటలాడే దుకాణాలు నేడు వెలవెలబోతున్నాయి. దుకాణాల ఎదుట ఆదివారం టోకెన్లను తీసుకుని బారులు తీరే కొనుగోలుదారులు నేడు మచ్చుకైనా కనిపించడం లేదు. కిలో ధర ను రూ. 200 ల నుంచి రూ. 152 కు తగ్గించినా కనీస కొనుగోళ్లు జరగడం లేదు. ఈ ధరలు మరింతగా తగ్గిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకటి, రెండు రోజులు పోతే కోళ్లను ఉచితంగానే పంపిణీ చేసే అవకాశాలు ఉన్నాయి. పట్టణంలో ప్రధాన హెచరీష్ కు చెందిన రెండు పెద్ద దుకాణాలు ఉండగా, ఇంకా చిన్నా చితక మరో 15 నుంచి 20 వరకు దుకాణాలు ఉంటాయి.

మటన్ దుకాణాల వద్ద కూడా..

మటన్ దుకాణాల వద్ద కూడ విక్రయాలు తగ్గిపోయాయి. ఈ దుకాణాలు 10 నుంచి 15 వరకు ఉంటాయి. బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రభావంతో చికెన్ విక్రయాలు తగ్గిపోయి మటన్ అమ్మకాలు పెరుగుతాయి అని అనుకున్నారు. కానీ అలాంటి వాతావరణం దుకాణాల వద్ద కనిపించడం లేదు. రెండు, మూడు ప్రాంతాల వద్ద ఉన్న చేపల దుకాణాల వద్ద మాత్రం కొనుగోలుదారులతో సందడి కనిపించింది.

మిర్యాలగూడలో చేపలకు భలే గిరాకీ

మిర్యాలగూడ/ మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడలో మరోవైపు ఏట మాంసం, చేపలు, రొయ్యల కొనుగోళ్లు భారీగా పెరిగాయి. సండే రోజు పట్టణంలోని మాంసం దుకాణాలతో పాటు చేపల మార్కెట్ కిటకిటలాడింది. బర్డ్‌ఫ్లూ భయాందోళనల నేపథ్యంలో రెస్టారెంట్లు, బార్లలో చికెన్ పదార్థాల వడ్డింపు నిలిపేశారు యజమానులు. ఇక పెళ్లిళ్లు, శుభకార్యాలతో పాటు ఇతర ఫంక్షన్లలో ఖర్చెక్కువైనా ఏట మాంసంతోనే భోజనాలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని ప్రముఖ చికెన్ బిర్యానీ సెంటర్‌ను తాత్కాలికంగా మూసేసిన నిర్వాహకులు 'బర్డ్‌ఫ్లూ కారణంగా' అంటూ షెట్టర్‌కు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం గమనార్హం.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

● మహిళ మృతి, 11 మందికి గాయాలు
● బస్సు డ్రైవర్ నిద్రమత్తుతో ప్రమాదం
● నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలో ఘటన



ప్రమాదానికి గురైన వేగ ట్రావెల్స్ బస్సు

మిర్యాలగూడఅర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్‌తో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాల్లో పూజలు చేయించేందుకు భర్తతో బయలుదేరిన మహిళను ట్రావెల్స్ బస్సు మృత్యుశకటంలా కబళించింది. ఆదివారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, 11 మంది గాయపడ్డారు. మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాకు చెందిన పలు కుటుంబాల సభ్యులు తమ సమీప బంధువు ఇంట్లో జరిగే వివాహ వేడుకలో పాల్గొనేందుకు శనివారం ఉదయం హైదరాబాద్‌కు వేగ ట్రావెల్స్‌కు చెందిన ఏఆర్ 06 బీ 7902 బస్సులో వచ్చారు. పెళ్లి వేడుక ముగిసిన అనంతరం స్వస్థలమైన నెల్లూరు జిల్లాకు శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత శంషాబాద్ నుంచి బయలుదేరారు. వేగ ప్రైవేట్ ట్రావెల్ బస్సు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో నార్కట్‌పల్లి - అద్దంకి ప్రధాన రహదారిపై ప్రమాదానికి గురైంది. మిర్యాలగూడ పరిధిలోని చింతపల్లి బైపాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి ఎదురుగా వెళ్తున్న టీఎస్29టీఏ 3528 నెంబరు గల ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీ కొట్టి, రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ క్షేత్రం సమీపంలోని గోడపైకి దూసుకెళ్లింది. ట్రాక్టర్‌ను వెనుకనుంచి బస్సు బలంగా ఢీకొట్టడంతో ట్రాక్టర్ ట్రాలీ పైభాగం ఎగిరి సుమారు 100మీటర్ల దూరంలో రోడ్డుపై పడిపోగా, ఇంజన్‌పై కూర్చున్న నూనావత్ సునీత (45) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాక్టర్‌ను నడుపుతున్న సునీత భర్త సైదానాయక్ తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి గురైన బస్సులో 36మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో డ్రైవర్ రెడ్డి శేఖర్, క్లీనర్ షేక్ ఉమర్‌తో పాటు మరో 8మంది ప్రయాణికులు గాయపడ్డారు. బస్సులో ప్రయాణిస్తున్న నెల్లూరు జిల్లాకేంద్రానికి చెందిన గిద్దలూరు శివరామకృష్ణ కాలు విరగటంతో, అదే జిల్లా వెంకటగిరికి చెందిన విద్యార్థి తోటపల్లి నాగచరిత్, తోటపల్లి రాజశేఖర్, నిడిగంటి లక్ష్మీప్రసన్న, కొడవలూరు సురేందర్ రావు, స్వర్ణ శైలజ, నెల్లూరు జిల్లా చెన్నూరుకు చెందిన నేడిగంటి అఖిలమ్మ, ఆత్మకూరుకు చెందిన తూపిరి రాధ అనే ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురైన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బాధితుల కుటుంబీకులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ప్రథమ చికిత్స అనంతరం వారిని తమ స్వస్థలాలకు తీసుకెళ్లారు.

కోరిక నెరవేరకుండానే మృత్యు ఒడికి

నూనావత్ సునీత, సైదా దంపతులు జీవనోపాధికోసం రెండు దశాబ్దాల క్రితం మిర్యాలగూడ మండలం ట్యాంకుతండాకు వలస వచ్చారు. స్థానికంగా కొంత భూమిని కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇటీవలే కొత్త ట్రాక్టర్‌ను కొనుగోలు చేయగా, తమ స్వస్థలమైన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దుబ్బతండా (జటావత్‌తండా)లో సోమవారం జరిగే బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొనేందుకు ట్రాక్టర్‌పై దంపతులిద్దరూ బయలు దేరారు. రెండు దశాబ్దాలుగా విడిపోయిన బంధుమిత్రులను కలుసుకుంటున్నామనే ఆనందంలో ఉన్న వారికి మృత్యు శకటంలా దూసుకొచ్చిన బస్సు తన జీవిత భాగస్వామిని బలిగొంది. సైదానాయక్ తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కొత్త ట్రాక్టర్‌కు బొడ్రాయి వద్ద పూజ చేయించాలన్న సునీత కోరిక నెరవేరకుండానే మృత్యు ఒడికి చేరింది. రెండేళ్ల క్రితమే పెద్దకుమార్తె నాగలక్ష్మి వివాహం జరిపించగా, కుమార్తె నాగేశ్వరి, కుమారుడు శివ ఉన్నారు. తల్లి అకాల మరణాన్ని జీర్ణించుకోలేక కన్నీరు మున్నీరుగా విలపించారు.

విస్తరించని అరణ్యం!

(5వపేజీ తరువాయి)

నాలుగేళ్లలో స్వల్పంగా 9.13శాతం మేరకే విస్తరించింది. దీన్ని బట్టి చూస్తే అటవీ సంపదపై నిరక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది. నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ ప్రాంతాలైన కంబాలపల్లి, చిత్రియాల ప్రాంతాలతోపాటు పలు ప్రాంతాలల్లో వన్యప్రాణులైన జింకలు, గుంటనక్కలు, చిరుతలు, ఎలుగుబంట్లు, హైనాల సంచారం అధికంగా ఉంటుంది. ప్రస్తుతం ఎండ తీవ్రతతో వాటికి నీటి సమస్య ముంచుకొచ్చి తాగునీటి కోసం ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి. గతంలో తాగునీటి కోసం కొంతమేరకు సాసర్లు ఏర్పాటు చేశారు. అయితే పూర్తిస్థాయిలో నీటి వనరులు లేకపోవడంతో వన్యప్రాణులు ఇబ్బంది ఎదుర్కొనే అవకాశాలున్నాయి. దేవరకొండ, నాగార్జునసాగర్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు అధికంగా ఉన్న సంగతి తెలిసిందే.

హరితాహారం, వనమహోత్సవంపై నీలినీడలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి హరితహారం, ఇప్పుడు చేపట్టాలనుకున్న వనమహోత్సవంపై నీలినీడలు అలుముకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 66లక్షలకు పైగా వివిధ రకాల మొక్కలు ప్రతి ఏటా జూలై మాసంలో హరితహారం పథకం కింద పంపిణీ చేసేవారు. అయితే అట్టహాసం మినహా సత్ఫలితాలు ఏమాత్రం ఇవ్వలేదు. దాదాపు 29శాఖలను సమన్వయం చేసుకొని వృక్షసంపదను పెంచాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. పల్లె, పట్టణ ప్రకృతి వనాల పేరిట చేపట్టిన యంత్రాంగం హడావుడి అంతా ఇంతా కాదు. మొక్కల సంరక్షణ కోసం నీళ్ల పోయకపోవడంతో అవి కూడా ఎదుగుదల లేకుండాపోయాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం పేరిట అధికారం చేపట్టిన కొత్తలో కొంత హడావుడి చేసినప్పటికీ మొక్కలు నాటే కార్యక్రమంపై పెద్దగా దృష్టి సారించలేదు. దీంతో హరితహారం, వనమహోత్సవం అనేవి పేరుకే పరిమితమయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్ఠమైన ప్రణాళిక ద్వారా మొక్కలను నాటి సంరక్షించాల్సిన అవసరం ఉంది. పరిశ్రమల యాజమాన్యమయితే మొక్కలు నాటే విషయంలో పెద్దగా స్పందించడం లేదని తెలుస్తుంది. స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కూడా అంతంతా మాత్రంగానే ఉంది. రహదారుల వెంట నాటిన మొక్కలు నూటికి 90శాతం చనిపోతే 10శాతం మాత్రమే బతికాయి.

అటవీ విస్తీర్ణం పెంపునకు కృషి

ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీ విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఏటా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి వాటిని పెద్ద ఎత్తున సంరక్షిస్తున్నాం. రహదారుల వెంట నాటిన మొక్కలు పెద్ద ఎత్తున పెరిగాయి. మొక్కలు ఎండిపోకుండా ట్యాంకర్ల ద్వారా నీరు పోసి మొక్కలను కాపాడుతున్నాం. లక్ష్యానికి అనుగుణంగా ప్రతీ సంవత్సరం మొక్కలు నాటడంతోపాటు వాటిని కాపాడటానికి ఎంతో కృషి చేసి లక్ష్యాన్ని చేరుకుంటున్నాం. ఈ ఏడాది కూడా వర్షకాలంలో 66 లక్షలకుపైగా మొక్కలను నాటేందుకు ప్రణాళికలను సిద్ధం చేయడంతోపాటు సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నాం.

-పి.రాజశేఖర్, డీఎఫ్‌వో, నల్లగొండ

హాజరు కోసం తిరగాల్సిందే

(5వ పేజీ తరువాయి)

సంబంధిత వర్క్ ఐడీకి సంబంధించిన పని ప్రదేశంలో ఎక్కడి నుంచైనా ఉపాధి కూలీల ఫొటోలను పంపే అవకాశముండేది. దీంతో వారికి హాజరు నమోదయ్యేది. కానీ ఎన్ఎంఎంఎస్‌లో కొత్తగా తెచ్చిన విధానంతో ఇపుడు అలా కుదరదు. ప్రతీరోజు ఉపాధి కూలీల్లో తాము కూలీ పని చేస్తున్న పని ప్రారంభ ప్రదేశానికి ప్రతీరోజూ వెళ్లాల్సిందే. అదీ ఒకసారే కాదూ ప్రతీరోజుకు రెండుసార్లు వెళ్లి ఫొటో దిగి పంపితేనే ఆ రోజుకు హాజరు పడేలా కొత్త విధానాన్ని అమలుపర్చారు. ఉదాహరణకు ఓ గ్రామంనుంచి మరో గ్రామం వరకు సుమారు ఐదు కి.మీల మేర ఫీడర్ ఛానల్ నిర్మించాల్సి ఉంది. ఈ పని కాలపరిమితి మొత్తం నెలరోజులు పడుతుందనుకుందాం. అయితే కొత్త విధానంతో ప్రతీరోజూ కూలీలు భువన్ యాప్‌లో గుర్తించిన పని ప్రారంభ ప్రదేశానికి ఫొటోకోసం వెళ్లాల్సిందే. ఇలా నెల రోజులపాటు ప్రతీరోజు రెండు పర్యాయాలు వచ్చేలా విధానం మార్చడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు.



పని చేస్తున్న 'ఉపాధి' కూలీలు (ఫైల్)

ప్రతీరోజూ కిలోమీటర్ల దూరం వెళ్లలేం



ఉపాధి పనిచేస్తూ హాజరుకోసం ప్రతీరోజు కిలోమీటర్ల దూరం వెళ్లాలంటే కష్టంగా ఉంది. అదీ రోజుకు ఒకసారంటే కాదు రెండు సార్లు వెళ్లి ఫొటో దిగితినే హాజరు పడుతుందంటున్నారు. ఈ ప్రతీరోజు పని ప్రారంభప్రదేశానికి వెళ్లాలనే పద్ధతి సరిగ్గాలేదు. అధికారులు ఆలోచించి మునుపటి మాదిరిగానే హాజరు పడేట్లు చెయ్యాలి.

-జెరిపోతుల లక్ష్మమ్మ, ఉపాధి కూలీ

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఉపాధి కూలీల హాజరుకోసం ఎన్ఎంఎంఎస్‌ఎలో తీసుకొచ్చిన కొత్త విధానం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, కూలీలు చెబుతున్న అభ్యంతరాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. కొత్త విధానం అమలులో ఎదురవుతున్న వాస్తవ ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించి హాజరు నమోదులో ఇబ్బందులు కలగకుండా మార్పులు చేసే అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

-యాదయ్య, ఏపీవో, నార్కట్‌పల్లి

నాలుగు గంటలూ ఉండాల్సిందే

గతంలో ఇచ్చిన కొలతల మేరకు రెండో లేదా మూడు గంటల్లోనే పని పూర్తిచేసుకుని ఇంటికి తిరిగి వెళ్లే వీలుండేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదంటున్నారు ఉపాధి హామీ సిబ్బంది. పని ప్రారంభ సమయానికి రెండోసారి ఫొటో దిగడానికి మధ్య కనీసం నాలుగు గంటల వ్యవధి ఉండాల్సిందే. అప్పుడే రెండో పర్యాయం ఫొటో యాప్‌లో కాప్చర్ అవుతుంది. ఇచ్చిన కొలతల ప్రకారం పని పూర్తిచేసినా హాజరు కోసం నాలుగు గంటలు ఆగాల్సిందేనట.

'ఐ' బ్లింకింగ్ చేస్తేనే..


ఉపాధి హామీ కూలీ హాజరుపడాలంటే మరో కొత్త చిక్కు వచ్చిపడింది. గతంలో ఓ 10 మందిని కలిపి ఓ ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసేవారు. అయితే పారదర్శకత పేరుతో అమలుచేస్తున్న 'ఐ'బ్లింకింగ్‌తో ఫొటో కాప్చర్‌కు సమయం పడుతోంది. ఉపాధి హామీ కూలీలను కూడా ఆధార్‌తో అనుసంధానించారు. దీంతో నిజమైన కూలీలే పనిప్రదేశంలో ఉండేలా తెచ్చిన కొత్త విధానంతో ఫొటో కాప్చర్ సమయంలో కళ్లను మూస్తూ... తెరుస్తూ... బ్లింకింగ్ చేయాల్సి వస్తుంది. ఇది ఫొటో తీసే సమయంలో సరైన విధంగా బ్లింకింగ్ చేయకపోయినా హాజరు జనరేట్ కాదు. అంతేకాదు ఫొటోలో ఉదాహరణకు ఓ 10 మంది కూలీలను కాప్చర్ చేస్తూ... ఫోన్‌యాప్‌లో పొరపాటున తొమ్మిది అని నమోదు చేస్తే హాజరుతీసుకోదు. ఫొటోలో ఉన్న హెడ్ కౌంట్.. యాప్‌లో సమాచార నమోదు సంఖ్య అంకె ఒకటే అయితేనే హాజరు నమోదవుతుందని చెబుతున్నారు.

చోరీలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

● రూ.2.50లక్షలు విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వరస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు నుంచి 4.4తులాల బంగార ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేంలో ఈ కేసు వివరాలను సీఐ చరమందరాజు వెల్లడించారు. హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు వీసా గోపి, పట్టణంలోని దద్దనాలచెరువు కాలనీకి చెందిన సెంట్రింగ్ కార్మికుడు షేక్ నాగుల్‌మీరా, ఖమ్మం జిల్లా చింతకాని మండలానికి చెందిన షేక్ అక్బర్ (ప్రస్తుత నివాసం నడిగూడెం మండలం సిరిపురం)లు ముఠాగా ఏర్పడ్డారు. గత నెల 25వ తేదీన హుజూర్‌నగర్‌లోని దద్దనాల చెరువులోని ఓ ఇంట్లో బంగారు ఆభర ణాలు చోరీ చేశారు. అదేవిధంగా మఠంపల్లి మండలం సుల్తాన్‌పూర్‌తండాలో మరో ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ చోరీలపై మఠంపల్లి, హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఆదివారం ఉదయం హుజూర్‌నగర్ పరిసర ప్రాంతాలలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా, గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకుని విచారించగా చోరీలు చేసినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి రూ.230లక్షల విలువైన 4 తులాలల 4 గ్రాముల 300 మిల్లీ గ్రాముల బంగారు వస్తువులు, పుస్తెలతాడు, రెండు ఉంగరాలు, రెండు పుస్తెలు, ఒక జత చెవి కమ్మలు, ఒక లాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిందితులను పట్టుకున్న పోలీసులను సీఐ అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతున్న వేసవి సమీస్తున్నందున ఇళ్లలో దొంగతనాలు జరగకుండా యజమానులు జాగ్రతగా ఉంటాలన్నారు. ఈ సమావేశంలో మఠంపల్లి ఎస్ఐ బాబు, ఏఎస్ఐ బలరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


విమాన గోపురంపై దేవతామూర్తుల విగ్రహాలు


విద్యుద్దీపాల వెలుగుల్లో బంగారు విమాన గోపురం


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు, సీఎస్ శాంతి కుమారి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి, నకిరేకల్, దేవరకొండ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, బాలునాయక్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి,


తిరువీధుల్లో సీఎం రేవంత్‌రెడ్డి గీత దంపతులు, చిత్రంలో సీఎస్ శాంతికుమారి


విమానగోపురానికి నమస్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, చిత్రంలో సీఎస్ శాంతి కుమారి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, వీరేశం, బీర్ల అయిలయ్య, ఈవో భాస్కర్‌రావు

విమాన గోపురం స్వర్ణశోభితం

● వేడుకగా సాగిన సంప్రోక్షణ మహాకుంభాభిషేకం

(5వపేజీ తరువాయి)

విమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమం భాగంగా 11.34 గంటలకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి సీఎం స్వర్ణ గోపుర ఆవిష్కరణ చేశా రు. అనంతరం 11.43 గంటలకు మహాకుంభ సంప్రోక్ష ణ జరిగింది.కాగా, ఉదయం 11.33 నుంచి 11.56 గంటల వర కు ఆలయ అర్చక బృందం, వేద పండితులు, రుత్వికులు, పారాయణికుల వేదమంత్రాలు,మంగళవాయిద్యాలనడుమ వైభవంగా కొనసాగగా 11.54గంటలకు సీఎం దంపతుల చేతుల మీదుగా ఆవిష్కరణ మహోత్సం వైభవంగా సాగింది. ఆవిష్కరణ మహాకార్యం ముగిసిన వెంటనే త్రితల రాజగోపురం నుంచి సీఎం ఆలయంలోకి చేరుకున్నారు. ముందుగా ఆంజనేయుడు, గండభేరుండ స్వామిని దర్శించుకొని ధ్వజస్థంభానికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలుకగా గర్భాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అంతరాలయంలోని స్వయంభువులను సీఎం దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు శేష వస్త్రం కప్పి వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటం, స్వర్ణ గోపురం జ్ఞాపికను అందజేశారు. దర్శనం ముగిసిన తర్వాత పశ్చిమ రాజగోపురం నుంచి లిఫ్ట్ ద్వారా అతిథిగృహం చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు బయలుదేరారు.

దేవతామూర్తులకు అవిశ్నలు

ఆలయ ఉత్తర తిరువీధిలో తూర్పు వాసుదేవ కుండం, దక్షిణం ప్రద్యున్న కుండం, పశ్చిమం సంకర్షణ కుండం, ఉత్తరం అనురుద్ధ కుండం, ఈశాన్యంలో మహాలక్ష్మీకుండంతో ఐదు హోమకుండాలు ఏర్పాటు చేయగా వాటిలో అగ్నిమథనం చేసి నరసింహ, సుదర్శన, గరుత్మంతుడి, లక్ష్మీదేవి మంత్రాలు, పారాయణాలు చేస్తూ దివ్య విమాన రాజగోపురంలోని దేవతలకు అవిస్సులు అందజేశారు. స్వామివారిని ఆవాహన చేసి ప్రతిష్ఠించి 108 మంది రుత్వికులు వేద మంత్రాలు పఠించారు. 60మంది రుత్వికులు లక్ష్మీ, నరసింహ, సుదర్శన, రామాయణం, భాగవతం, మూలమంత్ర హవనాలు, మూలమంత్ర జపాలతో పాటు ఉదయం సాయంత్రం విష్ణు, నరసింహ, రామాయణం, భాగవత పారాయణాలు చేశారు. అభిషేకాలు చివరి రోజు దిష్టి కుంభం, నైవేద్యం, గుమ్మడికాయ, కొబ్బరికాయ సమర్పించి స్వర్ణ దివ్య విమాన రాజగోపురానికి మహా కుంభాభిషేకం కలశంతో వేడుకలు నిర్వహించారు. కాగా, నాలుగు దిక్కుల్లో బ్రహ్మ, క్షేత్ర పాలకుడు, సోముడును ఆహ్వానించి ఈశాన్యంలో మాత్రం అంకురార్పణకు పాలికలు ఏర్పాటుచేశారు. మధ్యలో కవచమూర్తులను అధిష్ఠించి నదీజలాలతో కూడిన కలశానికి ఐదు రోజుల పాటు చేసిన హవనాలు, జపాలు, పారాయణాలతో పవిత్రత చేకూరింది. యాగశాలలోని హోమాల్లో మర్రి, రావి, మోదుగు, జువ్వి, మామిడి సమిదలు వినియోగించారు. ఆదివారం సంప్రోక్షణ మహాకుంభాభిషేక వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఐదు రోజుల వైభవాలు

ప్రధానంగా తొలిరోజు స్వస్తివాచనంతో పంచకుండాత్మక మహాయాగ సంప్రోక్షణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. రెండోరోజు యాగశాలలో ఛాయధివాసం నిర్వహించడంతో పాటు 14 నదీ తీర్థ జలాలు యాగశాలలోని కలశంలో కలిపారు. మూడో రోజు పంచ వింశతి కలశ స్నపనం, ధాన్యాధివాసం, నాలుగో రోజు ఏకాశీతి కలశ స్నపనం, శయ్యాధివాసం పూజ కార్యక్రమాలు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఐదో రోజు ఉదయం 9 గంటలకు మహాపూర్ణాహుతి, వేద శాత్తుముర్రై, 11.54 గంటలకు మూల నక్షత్రయుక్త వృశభ లగ్న పుష్కరాంశ సుము హూర్తాన స్వర్ణ విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం అనంతరం మహారాజభోగ నివేదన, పెరియ శాత్తుముర్రై, సాయంత్రం 4గంటలకు ఆస్థాన మండపంలో శాంతి కల్యాణం వైభంగా జరిగాయి. సీఎం వెంట ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి, నకిరేకల్, దేవరకొండ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, బాలునాయక్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, కలెక్టర్ ఎం.హనుమంతరావు, మహిళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, తెలంగాణ డెయిరీ అభివృద్ధి చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఇబ్బందులు

సీఎం పర్యటన సందర్భంగా సుమారు రెండు గంటలపాటు భక్తులు నిరీక్షించారు. కొండపైన, కింద, ఆర్టీసీ బస్టాండ్‌లో భక్తులు వేచి ఉన్నారు. ఉదయం 10.45 గంటలకు సర్వదర్శనాలు రద్దు చేసి తిరిగి మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభించారు. సుమారు 2.15 గంటలకు సర్వ దర్శనాలు రద్దుతో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు, చంటి పిల్లల తల్లులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


ఆలయ స్వీపర్లతో సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు



సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన




విమాన గోపురంపై దేవతామూర్తుల విగ్రహాలు

శివరాత్రి వేడుకలకు శ్రీకారం

● ఉదయం 11.30 గంటలకు విఘ్నేశ్వర పూజ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విఘ్నేశ్వర పూజ, స్వస్తిపుణ్యావచనంతో మహాశివరాత్రి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా శ్రీకారంచుట్టారు. ఉదయం 11.30గంటలకు శివాలయ అర్చకులు, రుత్వికబృందం వేదమంత్రాలతో విఘ్నేశ్వరుడికి తొలిపూజలు జరిపి పుణ్యాహవాచన పర్వాలకు తెరతీశారు. పవిత్రీకరించిన పుణ్యావచన జలాలతో ఆలయ పరిసరాలను సంప్రోక్షణచేసి రుత్వికరణం, రక్షాసూత్రధారణ, దీపారాధన జరిపారు. స్వామి, అమ్మవార్లకు, స్థాపిత దేవతలకు, మహోత్సవ నిర్వాహకులకు కంకణధారణ చేశారు. నీరాజన మంత్రపుష్ప పూజలు జరిపి తీర్థ ప్రసాద నివేదనలు జరిపారు. శైవాగమంలో విశ్వశాంతిని కలిగించమని పరమేశ్వరుడిని ప్రార్థించే ప్రక్రియే స్వస్తివాచనమని, సమస్త విఘ్నాలు తొలగడానికి సర్వకార్యాలు సఫలంకావాలని కోరుతూ విఘ్నేశ్వరుడికి తొలి పూజలు జరిపిట్లు ఆస్థాన సిద్ధాంతి గౌరీభట్ల సత్యనారాయణశర్మ భక్తులకు వివరించారు. ముందుగా కొండపైన రామలింగేశ్వరుడు కొలువైన శివాలయంలో పూజారులు వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాలతో ప్రత్యేకపూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు కంకణధారణ, స్వామికి నిత్యపూజలు ఆస్థానపరంగా జరిపారు. సాయంత్రం వేళ ఉప ఆలయంలో మృత్స్యంగ్రహణం, అంకురారోపణం, అష్టకలశారాధన, సోమకుంభ స్థాపన, ప్రదోశ కాలపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రుత్వికులు నమక, చమక, మంత్రపుష్ప పఠనం జరిపారు. వేడుకలను ఆస్థాన సిద్ధాంతి గౌరీభట్ల సత్యనారాయణశర్మ, శివాలయ ప్రధానార్చకులు గౌరీభట్ల నర్సింహరామశర్మ, ఆధ్వర్యంలో అర్చకబృందం, రుత్వికులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నర్సింహమూర్తి దంపతులు, ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు పతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రమేష్‌బాబు, రఘు, పర్యవేక్షకులు ధీరావత్ రామరావునాయక్, అధికారులు పాల్గొన్నారు.


సుదర్శన చక్రానికి నమస్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి గీత దంపతులు, చిత్రంలో కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కర్‌రావు, చిన జీయర్, భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి


సంప్రోక్షణ అనంతరం బంగారుమయ విమాన గోపురం


మహాకుంభాభిషేక వేడుకల్లో గాన సభలో పాట పాడుతున్న గాయని


సుదర్శన చక్రం

సీఎం పర్యటన సాగిందిలా..

11.09 గంటలకు కొండకింద వైకుంఠద్వారం చేరుకున్నారు.
11.11 గంటలకు సీఎం కాన్వాయి ఘాట్ రోడ్డుపైకి చేరింది.
11.14 గంటలకు ప్రొటోకాల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు.
11.20 గంటలకు లిఫ్ట్ ద్వారా ఆలయ తిరువీధిలోకి వచ్చారు.
11.22కు యాగశాలకు చేరుకున్నారు.
11.27 గంటల వరకు సీఎం దంపతుల పూజల్లో పాల్గొన్నారు.
11.28కు ఉత్తర రాజగోపురంనుంచి ఆలయంలోకి ప్రవేశించారు.
11.31 గంటలకు స్వర్ణ విమాన గోపురం వద్దకు చేరుకున్నారు.
11.32 గంటలకు స్వర్ణ గోపురం ఆవిష్కరించారు.
11.34కు స్వర్ణగోపురంపైన సుదర్శన చక్రంవద్దకు చేరుకున్నారు.
11.43కు మహాకుంభాభిషేక సంప్రోక్షణలో పాల్గొన్నారు.
11.47 గంటలకు కొబ్బరికాయ మొక్కులు చెల్లించుకున్నారు.
11.55కు సంప్రోక్షణ పూజలు పూర్తయ్యాయి.
12.00కు ఆలయంలోకి ప్రవేశించారు.
12.03 గంటలకు ధ్వజస్థంభానికి మొక్కులు చెల్లించుకున్నారు.
12.05 గంటలకు గర్భాలయ చుట్టూ ప్రదక్షిణలు చేశారు.
12.13 గంటలకు ప్రధాన ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు.
12.21కు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులకు సత్కారం చేశారు.
12.26కు లడ్డూ ప్రసాదం, స్వర్ణ గోపుర జ్ఞాపిక అందజేత
12.32కు పశ్చిమ రాజగోపురం నుంచి ఆలయ వెలుపలికి
12.35 గంటలకు లిఫ్ట్ ద్వారా అతిథి గృహం చేరిక.
1.06 గంటలకు ప్రసాద స్వీకరణ
1.08కు కొండపైనుంచి రోడ్డు మార్గంలో తిరుగు ప్రయాణంమయ్యారు.

బీఆర్ఎస్‌కు గుండా శ్రీనివాస్ రాజీనామా

శాలిగౌరారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల రైతుబంధు మండల కోఆర్డినేటర్, గురజాల తాజా మాజీ సర్పంచ్ గుండా శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలు, నియంతృత్వ ధోరణి వల్ల తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తాను ఏ పార్టీలో చేరడం లేదని ప్రజా సేవకు అంకితమై పని చేస్తానని తెలిపారు.

ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠకు విరాళం

నకిరేకల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మునిసిపాలిటీ పరిధిలోని 7వ వార్డు బాబాసాహెబ్‌గూడెంలో నూతనంగా ప్రతిష్ఠించిన ముత్యాలమ్మతల్లి విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ రూ.15,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, చింతల శ్రీనివాస్, వంటిపాక శ్రీను, వెంకన్న, లక్ష్మయ్య, తాదూరు రాకేష్, తండు నాగరాజు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం

సైదులు, ఎంఈవో, శాలిగౌరారం



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. పదవ తరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు మొదటి నుంచి ప్రణాళికాబద్ధంగా బోధించి సిలబస్ పూర్తి చేశాం. ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. పదవ తరగతి విద్యార్థుల కోసం చేపడుతున్న కార్యక్రమాలను ఎంఈవో మండుల సైదులు తెలిపారు.

(శాలిగౌరారం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి?

ఎంఈవో: మండలంలో 29 ప్రాథమిక పాఠశాలలు, 1యూపీఎస్ స్కూల్, 11 జడ్పీ హైస్కూళ్లు, 1 మోడల్ స్కూల్, 1 కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, 2ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఈ ఏడాది ఎంత మంది పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారు? ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు?

ఎంఈవో: మండలంలో 242 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరికి 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పదవ తరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఈవో: పదవ తరగతి విద్యార్థులకు మొదటి నుంచి ప్రత్యేక బోధన, తరగతులు ఏర్పాటు చేస్తూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని విద్యలో ప్రోత్సహిస్తున్నాం. ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులను అర్థమయ్యేలా బోధించేందుకు చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం ప్రీ ఫైనల్ పరీక్షలపై దృష్టి పెట్టాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మధ్యాహ్నం భోజనంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?

ఎంఈవో: మధ్యాహ్నం భోజనంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారమే అందిస్తున్నాం.

చివరికి చేరని నీరు


శాలిగౌరారం ప్రాజెక్టు



- విచ్చలవిడిగా అక్రమ విద్యుత్ మోటార్లు, లిఫ్టులు
- పట్టించుకోని ఐబీ అధికారులు
- ఎండుతున్న ఆయకట్టు పొలాలు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

శాలిగౌరారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు వేసవి రాకముందే అడగంటుతోంది. ఫలితంగా చివరి భూములకు నీరందక నిలువునా ఎండిపోతుండటంతో ఆయకట్టు చివరి భూముల రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 21 అడుగులకు గాను ప్రస్తుతం 8 అడుగుల నీరు మాత్రమే ఉండటంతో ఆయకట్టు రైతులు అయోమయంలో పడిపోయారు. ప్రాజెక్టు నీటిని తూముల ద్వారా పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడంతో పాటు అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ల వల్ల కూడా చివరి భూములకు నీరందటం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

అక్రమంగా మోటార్ల ఏర్పాటు

అక్రమంగా విద్యుత్ మోటార్లు, లిఫ్టులతో నీటి తరలిస్తున్నారు. శాలిగౌరారం ప్రాజెక్టు శిఖంలో అక్రమంగా వందకు పైగా విద్యుత్ మోటార్ల ద్వారా లిఫ్టులు ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాలకు కొంతమంది రైతులు నీటిని మూడు, నాలుగు కిలోమీటర్ల మేరకు తరలించి వాడుకుంటున్నారు. మరికొంతమంది రైతులు ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వల అంచునకు బావులు తీసి విద్యుత్ మోటార్లు బిగించి నీటిని ఎగువ ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరికొంత మంది లిఫ్టులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రధాన కాల్వలకు లైనింగ్ సరిగా లేకపోవడంతో ఆయకట్టు భూములకు సరిగ్గా నీరందడం లేదని ఆయకట్టు చివరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ సీజన్‌కు ఈ ప్రాజెక్టు కింద దాదాపు 5,500 ఎకరాలు సాగయ్యే అవకాశం ఉన్నా అక్రమ విద్యుత్ మోటార్లు, లిఫ్ట్ ద్వారా నీరు ఎగువ ప్రాంతాలకు వెళ్లడంతో ఆయకట్టులో స్థిరీకరించిన భూములకు నీరందటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అక్రమ విద్యుత్ మోటార్లను తొలగించడంలో నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ విద్యుత్ మోటార్లను తొలగిస్తే చివరి భూములకు నీరందే అవకాశం ఉంటుందని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు.

ప్రాజెక్టు ఆయకట్టు గ్రామాలు ...

శాలిగౌరారం ప్రాజెక్టు ప్రధాన కుడికాల్వ ద్వారా తిరుమలరాయినిగూడెం, శాలిగౌరారం, బాలిశెట్టిగూడెం, పావురాలగూడెం, అడ్లూర్, ఊట్కూరు గ్రామాల భూములు సేద్యమవుతాయి. ప్రస్తుతం శాలిగౌరారం, బాలిశెట్టిగూడెం గ్రామం వరకే కుడికాల్వ ద్వారా నీరందుతోంది. మిగిలిన పావురాలగూడెం, అడ్లూర్ ఊట్కూరు గ్రామాల పరిధిలో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. పావురాలగూడెం, అడ్లూర్, ఊట్కూరు గ్రామ ఆయకట్టు రైతులు నీటి కోసం రాత్రి సమయంలో కాల్వల చుట్టూ తిరుగుతున్నారు. శాలిగౌరారం ప్రాజెక్టు ప్రధాన ఎడమకాల్వ పరిధిలో రామగిరి, గురజాల, శాలిలింగోటం, తుడిమిడి, అంబారిపేట గ్రామాల్లో సాగు సేద్యమవుతాయి. ప్రస్తుతం రామగిరి, శాలిలింగోటం గ్రామాల భూములకే నీరందుతుంది. అంబారిపేట, తుడిమిడి ప్రాంత భూములకు నీరందక పోవడంతో అక్కడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీరు లేక పంటలు ఎండుతున్నాయి

శాలిగౌరారం ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో నాకు 10 ఎకరా ల భూమి ఉంది. మరో 10ఎకరాలు కౌలుకు తీసుకొని 20 ఎకరాల్లో వరి సాగు చేశాను. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సేద్యం చేస్తున్నాను. 20 రోజుల నుంచి నీరు రావడం లేదు. నీళ్ల కోసం రాత్రింబవళ్లు కాల్వ చుట్టూ తిరుగుతున్నాను. నీళ్లు రాక పంట మొత్తం ఎండిపోయింది. ఐబీ అధికారులు స్పందించి ప్రాజెక్టు నీరు సక్రమంగా కాల్వల్లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. లేకపోతే చేతికొచ్చిన పంట ఎండిపోతుంది.

\- వెంకన్న, రైతు, పావురాలగూడెం

చివరి భూములకు నీరందించేందుకు చర్యలు

శాలిగౌరారం ప్రాజెక్టులో ప్రస్తుతం 8 అడుగుల వరకు నీరుంది. ఉన్న నీటిని రైతులు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలి. చివరి భూముల రైతులకు నీరందే అవకాశం ఉంటుంది. చివరి భూముల రైతులు వంతుల వారీగా నీటిని సేద్యం చేసుకోవాలి. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి అక్రమ మోటార్ల తొలగింపుపై చర్యలు తీసుకుంటాం.

\- రాములు, ఇరిగేషన్ ఏఈ, శాలిగౌరారం ప్రాజెక్టు



భవిష్యత్తు అవసరాల కోసమే రోడ్డు వెడల్పు


వైద్యశిబిరంలో రోగులను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, లక్ష్మి దంపతులు

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అవసరాల కోసమే పట్టణంలో రహదారుల వెడల్పు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లవారుజామున పట్టణంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. నిర్మాణంలో ఉన్న రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. పనులపై పలువురితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన ప్రకారం రహదారి విస్తరణ పనులను పారదర్శకంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత పాటించాలన్నారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, చెన్నారెడ్డి, సైదులు, జంగిలి నాగరాజు, అన్వర్, పందుల భాస్కర్, ఆరెళ్ల సైదులు, లింగస్వామి, సైదులు, మణి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరంగా కంటి వైద్య శిబిరాలు

మునుగోడు నియోజకవర్గంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరాలను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నారు. సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని తన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో చండూరు మునిసిపాలిటీ, మండలంలోని గ్రామస్థుల కోసం మెగా కంటి వైద్య శిబి రాన్ని నిర్వహించారు. హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రి, ఫినిక్స్ ఫౌండేషన్ సౌ జన్యంతో సంయుక్తంగా నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సతీమణి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి దంపతులు సందర్శించారు. కంటి సమస్యతో వచ్చి చికిత్స చేయించుకుంటున్న ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉచితం నిర్వహించే మెగా కంటి వైద్య శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ఇప్పటి వరకు రెండు విడతలుగా నిర్వహించిన శిబిరాల్లో 324మందికి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 152 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి 110మందిని ఆపరేషన్‌కు పంపినట్లు వెల్లడించారు. శిబిరంలో వైద్య పరీక్షలకు వచ్చిన మహిళలు, వృద్ధులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల నుంచి వచ్చేందుకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో రోగులను ఆప్యాయంగా పలకరించారు. ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏ సమస్య ఉన్నా భయం చెందవద్దు.. మీ ఆరోగ్య భద్రతకు నాది భరోసా అంటూ ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల కాంగ్రెస్ శ్రేణులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దూషించిన కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ


కనగల్ ఎక్స్‌రోడ్డులో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కనగల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగట్టె గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ జిల్లా విజయ్‌ని కులం పేరుతో దూషించిన గ్రామ కార్యదర్శి ఎస్.నర్సిరెడ్డిని సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కనగల్ ఎక్స్‌రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి నర్సిరెడ్డి ఇంటి పన్ను వసూళ్లకు డబుల్ బుక్ పెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అతడి అవినీతిని ప్రశ్నించినందుకు విజయ్‌ను కులం పేరుతో దుర్భాషలాడి అవమానపరిచారని తెలిపారు. ఉన్నతాధికారులు నర్సిరెడ్డిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కానుగు లింగస్వామి మల్టీపర్పస్ వర్కర్స్ విజయ్, శంకర్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, పాండు, పారిజాత, నాగేశ్వరి, బిక్షం, రాములు, కిరణ్, సాగర్, సైదులు, లింగయ్య, యాదగిరి పాల్గొనానరు. ఇదిలా ఉంటే తాను పంచాయతీ వర్కర్‌ను కులంపేరుతో దూషించలేదని కార్యదర్శి నర్సిరెడ్డి తెలిపారు. అవినీతికి పాల్పడ్డానని చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని పేర్కొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం


గ్రామంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కనగల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్లచెన్నారం గ్రామంలో గల సీతారామాంజనేయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాలు, సన్నాయి వాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు, తలంబ్రాలు ఒడి బియ్యం సమర్పించారు. సాయంత్రం సహస్రనామ స్తోత్ర పారాయణం, పుష్పయాగం, గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, ఆలయ ధర్మకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక


జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో రమేష్

మర్రిగూడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు అండర్ -14 విభాగంలో మర్రిగూడ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ రమేష్ తెలిపారు. హైదరాబాద్‌లోని తుర్కయాంజల్ ప్రో కబడ్డీ నిర్వాహకుల సహకారంతో ఇండియన్ ఒలంపిక్ కమిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అండర్ -14 కబడ్డీ విభాగంలో నిర్వహించిన పోటీల్లో వారు ప్రతిభ చాటారు. వారిని జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. వచ్చే నెల చెన్నైలో జరిగే ఆల్ ఇండియా కబడ్డీ నేషనల్ ఛాంపియన్ పోటీలకు వెళ్లనున్నట్లు తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థి గణేష్, అఖిల్, నితిన్‌లతో పాటు జడ్పీ హైస్కూల్ విద్యార్థి వెళ్లనున్నట్లు కోచ్ రమేష్ తెలిపారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది.

ఆత్మరక్షణతో ఆత్మవిశ్వాసం

నల్లగొండస్పోర్ట్స్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు మార్షల్ కీడ ఎంతో ఉపయోగపడుతుందని డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి అన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఎస్ఎస్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమీ నల్లగొండ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన షోటోఖాన్ తెలంగాణ రాష్ట్రస్థాయి వారియర్ కప్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు మార్షల్ క్రీడను నేర్చుకుంటే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. క్రీడలు ఆడటం వల్ల శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. తెలంగాణ చీఫ్ రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు మార్షల్ క్రీడను నేర్చుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు జీవితంలో అనుకోకుండా ఎదురయ్యే ఘటనలను ప్రతిఘటించవచ్చని సూచించారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులకు కేటగిరి వారీగా పోటీలు నిర్వహించారు. కటాస్, కుమితే వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో నర్సిరెడ్డి, శ్రీధర్, నాగేష్, సోములు, వంశీ, నిఖిల్, ఆకాష్, వెంకటేష్, రిఫరీలు, కోచ్‌లు, మాస్టర్లు పాల్గొన్నారు.

'మదర్ డెయిరీ ఆస్తులను విక్రయించవద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి శ్రవణ్‌కుమార్

చిట్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆస్తులను విక్రయించి కట్టేందుకు పాలకవర్గం తీర్మానించడం సరైనది కాదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ విమర్శించారు. చిట్యాలలో ఆదివారం నిర్వహించిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడి రైతులు శ్రమించి ఉత్పత్తి చేసిన లాభాలను డెయిరీ పాలకవర్గం స్వాహా చేయడం వల్లే కొన్నేళ్లుగా నష్టాల బాట పట్టిందని, ఆ సొమ్మును బాధ్యులైన వారి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఆస్తులు అమ్ముకుంటూ పోతే సంస్థ మనుగడే ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేకనిధులు విడుదల చేసి మదర్‌డెయిరీని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఎండీ.అక్బర్, పట్టణ కార్యదర్శి ఎస్కే షరీఫ్, వెంపటి శ్రీనివాస్, బొల్లోరి లింగయ్య, దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, దండిగ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పునరావాసం కల్పించాలి

● టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముద్దం శ్రీనివాస్

మర్రిగూడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చర్లగూడ రిజర్వాయర్ ముంపునకు గురైన బాధిత భూనిర్వాసితులకు పునరావాసంతో పాటు అర్హులైన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించి రిజర్వాయర్ పనులు పూర్తిచేయాలని టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్ అన్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్‌లో నర్సిరెడ్డిగూడెం, చర్లగూడ, వెంకేపల్లి, వెంకేపల్లి తండా గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయని అన్నారు. ప్రభుత్వం వారి పట్ల నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. నాలుగు గ్రామాల బాధితులు సర్వం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు పునరావాసం కల్పించకుండా నర్సిరెడ్డిగూడెం గ్రామాన్ని ఖాళీ చేయాలని గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు.

పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కల్పించకపోవడం వల్ల బాధితులు పనులను అడ్డుకుంటున్నారని తెలిపారు. వారికి ప్యాకేజీ చెల్లించి రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు పుప్పాల యాదయ్య, నర్సింహ, నరేష్, లక్ష్మయ్య, ముత్తయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో కరువు ఛాయలు

● మాజీ ఎమ్మెల్యే లింగయ్య


ఎండిపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని మునుకుంట్ల గ్రామంలో ఆదివారం ఎండిపోయిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులు ఎండిన పంట పొలాలను మేకలకు, గేదెలకు వదిలివేయడం చూసి ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పరిపాలనలో ఎలాంటి కరువు ఛాయలు కనపడలేదని, అన్నదాతలు ఆనందంగా ఉన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అంటేనే కరువు అని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఏడాదిన్నర కాకముందే రాష్ట్రంలో పంట పొలాలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, నాయకులు పెద్ది బాలనర్సింహ, సైదిరెడ్డి, పనస సైదులు, నర్సింహ, సుధాకర్, వడ్డే సైదిరెడ్డి, మనోహర్, శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ఇచ్చిన వారిని విమర్శించడం తగదు

● ఆర్ఎంపీల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు

నల్లగొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఆర్ఎంపీలకు మద్దతు ఇచ్చిన ఎమ్మెల్సీ కోదండరాంను జూనియర్ డాక్టర్లతో పాటు ఐఎంఏ విమర్శించడం తగదని గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.హనుమంతరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎంపీల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ఎదుట ఇటీవల ఆత్మగౌరవ సభ నిర్వహించామని తెలిపారు. ఈ సభకు కోదండరాం హాజరై తమ సంఘానికి మద్దతు తెలపడంతో పాటు తెలంగాణ ఉద్యమకారుడిగా ఆయన తమ సమస్యలను విని అండగా నిలిచారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కోదండరాం ఎంతో కీలకపాత్ర వహించారని, ఆయనపై ఐఎంఏతో పాటు జూనియర్ డాక్టర్లు ఇష్టానుసారంగా మాట్లాడటం బాధాకరమని అన్నారు. ఆర్ఎంపీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు దశల వారీగా ఆందోళన చేపడుతామన్నారు.


ఈ సమావేశంలో గామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, బ్రహ్మాచారి, డీఎస్ఎన్ చారి, నసీరొద్దీన్, వెంకటేశ్వర్లు, మదునాచారి, మునీర్, హుస్సేన్, నరసింహులు, యాదగిరి, లలిత, మణికుమారి, రాజశేఖర్‌రావు, దశరథ, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శిస్తే ఊరుకోం


నకిరేకల్‌లో కేసీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

నకిరేకల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కేసీఆర్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి విమర్శిస్తే ఊరుకోమని, టీడీపీ కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారని టీడీపీ నకిరేకల్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి యాతాకుల అంజయ్య అన్నా రు. చంద్రబాబుతో పాటు టీడీపీ గురించి హేళనగా మాట్లాడిన జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం నకిరేకల్ మెయిన్‌సెంటర్‌లో కేసీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలను టీడీపీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భవించిందే తెలంగాణలోనని అన్నారు. టీడీపీలో కేసీఆర్ ఉన్నత పదవులు అనుభవించాడని, టీడీపీ పేదలకు చేసిన సేవలు జగదీష్‌రెడ్డికి తెలియకపోవచ్చని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టీడీపీ భువనగిరి పార్లమెంట్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి నూకల శ్రీధర్‌రెడ్డి, అధికార ప్రతినిధి నక్క రాంభూపేష్ ముదిరాజ్, లింగాల యాదయ్య, నకిరేకల్, కేతేపల్లి మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు అంతటి రాములు, దోనాల వెంకట్‌రెడ్డి, శ్రీపాద నంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 24 ఫిబ్రవరి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు


గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 19.4

యాదగిరీశుడి గోపురం స్వర్ణ శోభితం

వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు



యాదగిరిగుట్ట ప్రధాన ఆలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులకు ఆశీర్వచనం అందజేస్తున్న ప్రధాన అర్చకుడు నల్లన్‌థిఘల్ లక్ష్మీనర్సింహచార్యులు, చిత్రంలో సీఎస్ శాంతికుమారి, కలెక్టర్ హనుమంతరావు

బంగారు విమాన గోపురానికి నమస్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

యాదగిరికొండపై బంగారు విమాన గోపురం

దేశంలోనే మొట్టమొదటి ఎత్తయిన స్వామివారి విమానగోపురం స్వర్ణ మయమై దర్శనమిచ్చింది. 68 కిలోల బంగారంతో తయారు చేసిన విమాన గోపురం చూసేందుకు చూడముచ్చటగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గీత దంపతులు ఆదివారం లక్ష్మీ నరసింహస్వామి స్వర్ణ దివ్య విమాన గోపురం మహాకుంభాంభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో పాల్గొని, స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. సంప్రోక్షణకు ముందే ఐదురోజులుగా వేదమంత్ర పఠనాల నడుమ మహాకుంభాభిషేక పూజలు కొనసాగాయి.

-(ఆంధ్రజ్యోతి-భువనగిరి అర్బన్)

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి సన్నిధిలో స్వర్ణ దివ్య విమాన రాజగోపురం ఆదివారం ఆవిష్కృతమైంది. గత ఐదు రోజులుగా రుత్వికులు, అర్చక బృందం హవనాలు, జపాలు, పారాయణాలు, వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ వేడుకను వైభవంగా నిర్వహించారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, గీత దంపతులు చేతుల మీదుగా మహాకార్యం విజయవంతమైంది. వానమామలై మఠం 31వ మధుర కవి పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. జీయర్ అనుమతితో మహాకుంభ కలశం ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు నెత్తిన మోస్తూ ఐదు అంతస్తుల (50.5 చదరపు అడుగులు) ఎత్తులోని స్వర్ణ గోపురం సుమారు 126 మెట్లెక్కారు. ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు అర్చకత్వంలో మహాకుంభాభిషేక సంప్రోక్షణ చేశారు. ఈ వేడుకల్లో భాగమయ్యేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డుమార్గం ద్వారా ఉదయం 11.09 గంటలకు యాదగిరిగుట్ట వైకుంఠద్వారం వద్దకు చేరుకున్నారు. కొండపైకి చేరుకున్న సీఎం అతిథి గృహంలో సాంప్రదాయ దుస్తులు ధరించి లిఫ్ట్ ద్వారా ఆలయ ఉత్తర తిరువీధిలోని యాగశాలలో నిర్వహించిన మహాపూర్ణాహుతిలో 11.22 నుంచి 11.27 గంటల వరకు పాల్గొన్నారు. అక్కడి నుంచి ఉత్తర రాజగోపురంనుంచి దక్షిణ భాగం మెట్ల ద్వారా 11.31 గంటలకు స్వర్ణ గోపురం వద్దకు వెళ్లారు. అదే సమయంలో సీఎం వెనకాల రామానుజ జీయర్ ఆజ్ఞానుసారం మహాకుంభంతో ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు నెత్తిన ఎత్తుకొని 126 మెట్లెక్కి సంప్రోక్షణలో పాల్గొన్నారు. స్వర్ణమయ...

- మిగతా 7వ పేజీలో...



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు



హాజరు కోసం తిరగాల్సిందే!

- లేదంటే హాజరు.. గైర్హాజరే?
- ఎన్‌ఎంఎంఎస్‌లో హాజరుకు కొత్త విధానం
- ప్రతీ రోజు రెండు పర్యాయాలు ఫొటో దిగాల్సిందే

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీ పనంటే ఏముందీ... ఓ రెండు గంటల పాటు పనిచేసి వస్తే సరిపోద్దనే రోజులు మారాయి. గతంలో మాదిరిగా నిర్ణీత కొలతలో ఇచ్చిన పనిని ఓ రెండు గంటల్లో పూర్తి చేసి ఇంటికి వెళ్తామంటే కుదరదిక. కనీసం పని ప్రదేశంలో నాలుగు గంటలైనా ఉండాల్సిందే. అంతేనా.. చేసిన కూలీ పనికి ఆ రోజు హాజరు పడాలంటే పని ప్రారంభ ప్రదేశానికి ప్రతీ రోజూ వెళ్లాల్సిందే. అదీ ఒకసారే కాదు. రెండుసార్లు వెళ్లి ఫొటోలు దిగాల్సిందే. లేదంటే హాజరు గైర్హాజరే!. ఇది ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన కొత్త విధానమట. ఈ పద్ధతి అమలుతో ఉపాధి కూలీలకు హాజరు తిప్పలు తప్పడంలేదు. కొన్ని ఉపాధి పనులకు ఈ విధానంపై మినహాయింపు ఇచ్చినా అమలు చేయాల్సిన పనుల్లో మాత్రం హాజరు కోసం కూలీలు, సాంకేతిక సమస్యతో 'క్షేత్ర' సహాయకులూ ఇబ్బందిపడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో పారదర్శకత పేరుతో ఈ తరహా తీసుకువస్తున్న సంస్కరణలు పథకం అమలులో అసౌకర్యంగా మారాయి.

గతంలో అలా

ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు ఓవర్క్ ఐడీ ఇచ్చే వారు. ఆ వర్క్ ఐడీకి సంబంధించిన ప్రదేశాల్లో ప్రతీరోజూ ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ఫొటోలను ఆ శాఖ ఇచ్చిన స్మార్ట్ ఫోన్ యాప్ ద్వారా ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం)కు క్షేత్ర సహాయకులు పంపేవారు. దీంతో పని ప్రదేశానికి సంబంధించిన ఫొటో అప్‌లోడ్‌తో కూలీల హాజరు జనరేట్ అయ్యేది. పని పూర్తయ్యే వరకు ప్రతీరోజూ నిర్ణీత ప్రదేశంలో ఏదో ఒక చోటనుంచి రెండుసార్లు కూలీల ఫొటోలు పంపే విధానం ఉండేది.

ఇప్పుడు ఇలా

భువన్ యాప్ ద్వారా తొలుత పని గుర్తించి పంపుతారు. ఆ పని మంజూరైన తర్వాత వర్క్ ఐడీ జనరేట్ అవుతుంది. అయితే గతంలో....

- మిగతా 6వ పేజీలో...

విస్తరించని అరణ్యం

- నల్లమలకే పరిమితమైన అటవీ ప్రాంతం
- హరితహారం, వనమహోత్సవంతో ప్రయోజనమేదీ?
- అటవీయేతర ప్రాంతాల్లో పెరగని వృక్ష సంపద

మానవ ప్రమేయం లేకుండా ప్రకృతిలో పుట్టి, పెరిగే మొక్కలు, చెట్లు, గడ్డిపొదలు, సహజ సంపద వల్ల నల్లమల అటవీ ప్రాంతం విస్తరించింది. ప్రధానంగా దేవరకొండ నియోజకవర్గం నుంచి మొదలుకొని కృష్ణా పరివాహక ప్రాంతంలో దట్టమైన అడవి భూభాగం ఉంది. అటవీ విస్తీర్ణం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లేకపోవడంతో హరితాహారం ద్వారా ఆ లోటును పూర్తి చేయాలని గత ప్రభుత్వం భావించినప్పటికీ వృక్ష సంపద విస్తరించలేదు. చాలాచోట్ల అనధికారికంగా అడవుల నరికివేత ఉండటం వల్ల వృక్ష సంపద తరిగిపోతుంది. హరితహారం కింద పెట్టిన మొక్కలు వీధుల్లో కరెంట్ వైర్ల కింద పెట్టడంతో అవి పెరిగినప్పుడల్లా కొమ్మలతోపాటు ఒక్కొక్కసారి మొదళ్ల వరకు నరికివేస్తున్నారు. వాస్తవానికి వాతావరణ సమతుల్యంకోసం అడవుల విస్తీర్ణం 33శాతం పెంచాల్సిన అవసరం ఉంది. హరితహారం, వనమహోత్సవాల కింద ప్రతి సంవత్సరం జూలైలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా ఉపయోగం లేకుండా పోతుంది. ప్రత్యేక రాష్ట్రమేర్పడిన తర్వాత 2015లో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మొక్కలను అటవీయేతర ప్రాంతాల్లో పెంచే ప్రయత్నాలకోసం ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్రంలో అటవీ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న జిల్లాలు అదిలాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రాంతాలు మొదటి స్థానాల్లో ఉన్నాయి. ఉమ్మడి

వాతావరణ సమతుల్యాన్ని సంరక్షించడంలో వనాల ప్రాధాన్యత ఎనలేనిది. భారీగా వర్షాలు కురవాలంటే వృక్ష సంపద పెరగడం, లేదంటే అరణ్యాలే ఆధారమవుతుంటాయి. అడవులు పెరగడం వల్ల జీవరాశుల మనుగడ కూడా ఎంతగానో ఉంటుంది. గత పదేళ్లలో అప్పటి ప్రభుత్వం హరితాహారం కింద మైదాన ప్రాంతంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలు, పరిశ్రమలు, ఇతర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. అయితే ఇందులో నూటికి నూరుశాతం మొక్కలు బతికింది లేదు. మొక్కలు ప్రతి ఏటా వర్షకాలం ప్రారంభంలో మినహా వాటి సంరక్షణకు బాధ్యతలు చేపట్టక పోవడంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయింది తప్ప మొక్కల ఎదుగుదల పూర్తి స్థాయిలో లేదన్న విమర్శలున్నాయి.


- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

నల్లగొండ జిల్లా కేవలం నల్లమల అటవీ ప్రాంతంపైనే ఆధారపడి ఉండటంతో అటవీ విస్తీర్ణంపై నీలినీడలు అలుముకున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 65వేలకు పైగా హెక్టార్లలో..

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 65వేలకు హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో దేవరకొండ నియోజకవర్గం సరిహద్దుల్లో అటవీ ప్రాంతం ఉంది. కృష్ణా పరివాహక ప్రాంతం ఇటు నల్లగొండ సరిహద్దుల్లో ఉన్న ప్రాంతంలో అడవులు విస్తరించి ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో రాచకొండ గుట్టల్లో మాత్రమే కొంతమేరకు అటవీ ప్రాంతం ఉండగా, సూర్యాపేట జిల్లాలో అటవీ ప్రాంతం అంతంతా మాత్రమే. ఉమ్మడి జిల్లాలో 33శాతం మేరకు అటవీ విస్తీర్ణం పెంచడంకోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొక్కలు పంపిణీ చేయడం మినహా సంరక్షణ కోసం ఏ మాత్రం చర్యలు చేపట్టకపోవడంతో వేసిన మొక్కలు వేసినట్టే ఎండిపోగా కొన్నిచోట్ల పెరిగిన చెట్లు రోడ్ల విస్తరణలో కొట్టేయడం, కొన్ని చోట్ల పంపిణీ చేయకుండానే నర్సరీలోనే మొక్కలు ఎండిపోయాయి. గత నాలుగేళ్ల క్రితం 8.52శాతం మేరకు అటవీ విస్తీర్ణం ఉండగా ప్రస్తుతం 9.13శాతం మేరకు అటవీ విస్తీర్ణం పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. అటు దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. మిగతా ప్రాంతాలపై అధికారులు, ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. కేవలం సహజంగా ఉన్న అటవీ సంపద గురించి మాత్రమే అధికారులు చెబుతున్నారు తప్ప పెంచిన వృక్ష సంపద ఎంతని చెప్పలేకపోతున్నారు. 2013లో ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా ఉపగ్రహ కొలతల ప్రకారం గత కొన్నాళ్ల వరకు 8.52శాతం ఉండగా...

- మిగతా 6వ పేజీలో...





హాలియాలోని ఆంజనేయస్వామి ఆలయంలో సంప్రోక్షణకు కలశాలతో వచ్చిన అర్చకులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కాంగ్రెస్ సీనియర్‌నేత, మాజీమంత్రి కుందూరు జానారెడ్డి

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని సీఎల్పీ మాజీ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. హాలియాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆంజనేయస్వామి ఆరాధనతో ప్రతి ఒక్కరిలో శక్తి, ధైర్యం, బలం చేకూరుతుందని అన్నారు. ఆంజనేయస్వామి రామునికి శిష్యునిగా వజ్ర సంకల్ప బలంతో తన ప్రత్యేకతను చాటుకున్నారని పేర్కొన్నారు.

8

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



ప్రవేశ పరీక్షను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన టీజీసెట్-2025 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ ఇలాత్రిపాఠి తెలిపారు. ఆదివారం ఆమె జిల్లాకేంద్రంలోని చర్లపల్లి బైపాస్ వద్ద ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన టీజీసెట్ ప్రవేశ పరీక్షను తనిఖీ చేశారు. ప్రవేశ పరీక్షకు మొత్తం 12,929 మంది విద్యార్థులను కేటాయించగా, పరీక్షకు 12,503 మంది విద్యార్థులు హాజరయ్యారని, 426 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. 96.71శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు కలెక్టర్ వెల్లడించారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.

విశ్వబ్రాహ్మణులంతా ఏకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు చంద్రశేఖర్

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కులాలకతీతంగా విశ్వబ్రాహ్మణులంతా ఏకం కావాలని విశ్వబ్రాహ్మణుల సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు గడగోజు చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని విశ్వకర్మ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఫలాలు పొందేందుకు, చట్టసభల్లో విశ్వకర్మలకు సముచిత స్థానాలు రాబట్టేందుకు ఐక్యత అవసరమన్నారు. వృత్తిపరంగా వేరుగా ఉన్న సంఘ సభ్యులు కలిసికట్టుగా సంఘ ప్రతిష్ఠతకు పాటు పడాలన్నారు. సమావేశంలో అన్నభీమోజు నాగార్జునాచారి, ఇనుగుర్తి గోవర్ధన్, చేర్యాల వెంకటాచారి, సొల్లేటి నర్సింహాచారి, గొట్టిముక్కుల లక్ష్మణ్, ఈశ్వరాచారి, సైదాచారి, వాసు, కోటయ్య, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని సద్వినియోగం చేసుకోవాలి



యాద్గార్‌పల్లి గ్రామంలో వసతిగృహ ప్రారంభానికి పూజలు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడరూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పేదల అవసరాల కోసం నూతనంగా నిర్మించిన వసతిగృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన వసతిగృహాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో పేద ప్రజలు చిన్నచిన్న శుభ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఈ వసతిగృహం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, జూలకంటి రంగారెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా అమలు చేయడంలో విఫలం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాదూరి గోవర్ధని

వేములపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రైతులకు రైతుభరోసాను పూర్తిస్థాయిలో అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అధికారం చేపట్టిన నాటి నుంచి రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకు మూడు విడతలుగా మూడు ఎకరాలు ఉన్న రైతులకు కూడా రైతు భరోసాను పూర్తిస్థాయిలో అందించలేదని ఆరోపించారు. ఇలా వేస్తే రైతు భరోసా నిధులు పూర్తిస్థాయిలో ఎప్పుడు వస్తాయో తెలియక రైతులు అయోమయంలో పడిపోయారని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాదూరి శశిధర్‌రెడ్డి, రొండి శ్రీనివాస్, మండల నాయకులు పతాని శ్రీను, ఐతగాని విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వరాల సోమేశ్వరాలయంలో సినీ డైరెక్టర్ పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న సినీ డైరెక్టర్ శంకర్

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 23 (ఫిబ్రవరి): మండలంలోని చిరుమర్తి గ్రామంలో గల వరాల సోమేశ్వరాలయంలో శివాలయ గౌరవ అధ్యక్షుడు, సినీ డైరెక్టర్ నిమ్మల శంకర్‌మాధవి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ సింహద్వారాన్ని ప్రతిష్ఠించారు. అదేవిధంగా శివరాత్రి సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. శివరాత్రి సందర్భంగా కల్యాణ మహోత్సవానికి సంబంధించిన వస్తు సామగ్రిని శివాలయ ధర్మకర్తకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, పూజారి కూరెళ్ల వెంకటాచారి, శాలివాహన చిరుమర్తి గౌరవ అధ్యక్షుడు గొట్టిపర్తి బచ్చయ్య, మాలమహానాడు మండల బాధ్యులు తాళ్లపల్లి మిన్నయ్య, విశ్వబ్రాహ్మణ చిరుమర్తి గ్రామ అధ్యక్షుడు నమోజు ఉపేంద్రచారి, శంకరాచారి, నాగాచారి, నక్క ఉపేందర్, కొండా వెంకన్న పాల్గొన్నారు.

సంత్ గాడ్గే మహరాజ్ ఆశయ సాధనకు కృషి

● బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్



సంత్ గాడ్గే మహరాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, స్వచ్ఛభారత్ పితామహుడు సంత్ గాడ్గే మహరాజ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. సంత్ గాడ్గే మహరాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచిన గొప్ప వ్యక్తి సంత్ గాడ్గే మహరాజ్ అన్నారు. చీపురు పట్టి రహదారులను శుభ్రం చేయడంతో పాటు వైద్యశాలల ఏర్పాటుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. సామాజిక అసమానతలు రూపుమాపేందుకు కృషి చేసిన మహనీయుడిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, కుమ్మరికుంట్ల సుధాకర్, ఎర్రబెల్లి దుర్గయ్య, దోనేటి శేఖర్, గణేష్, మదన్, ప్రసాద్, నవాబ్, శివ, వెంకటేష్, పవన్, నరేంద్రాచారి, చింటు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పునరావాసం కల్పించాలి

మర్రిగూడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చర్లగూడ రిజర్వాయర్ ముంపునకు గురైన బాధిత భూనిరాస్వితులకు పునరావాసంతో పాటు అర్హులైన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించి రిజర్వాయర్ పనులు పూర్తిచేయాలని టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్ అన్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడ రిజర్వాయర్‌లో హ్యాధ/ఢజ తండా గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయని అన్నారు. ప్రభుత్వం వారి పట్ల నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి



మాట్లాడుతున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, పక్కన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



స్వామివారి పూజల్లో పాల్గొన్న నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి

హాలియా, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మనస్పర్థలు లేకుండా మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. హాలియాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆంజనేయస్వామి ఆరాధనతో ప్రతి ఒక్కరిలో శక్తి, ధైర్యం, బలం చేకూరుతుందని అన్నారు. ఆంజనేయస్వామి రామునికి శిష్యునిగా వజ్ర సంకల్ప బలంతో తన ప్రత్యేకతను చాటుకున్నారని పేర్కొన్నారు. తను ఆంజనేయ దండకం చదివే వాడినని, అర్ధరాత్రి కూడా స్వామివారికి మొక్కి ధైర్యం తెచ్చుకొని వెళ్లేవాడినని తన పాత జ్ఞాపకాలు గుర్తు చేశారు. ఎడమ కాల్వ తవ్వకాల్లో లభ్యమైన ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. నంది వెలుగు బాలాజీ గురుకుల్‌స్వామి, రేపల్లే, సపతి ప్రసాద్ ఆధ్వర్యంలో పూర్ణాహుతి, సంప్రోక్షణ నిర్వహించి అనంతరం స్వామివారి నిజరూప దర్శనాన్ని భక్తులకు కలగజేశారు. ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హనుమాన్ ఉపాసకుడు, ఎమ్ఎస్ రామారావు మనవడు డాక్టర్ శ్రీనివాస్‌స్వామి హనుమాన్ చాలీసా గురించి వివరించారు. సాయంత్రం హాలియా పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ స్వామివారి శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాలక మండలి ఏర్పాట్లు చేసింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయ చైర్మన్ మేడేపల్లి మోహన్‌రావు, వ్యాపారవేత్త చిట్టిపోలు యాదగిరి, ప్రముఖులు కాకునూరి నారాయణగౌడ్, మలిగిరెడ్డి లింగారెడ్డి, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, బుసిరెడ్డి పాండురంగారెడ్డి, యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, మన్నెం రంజిత్‌యాదవ్, చింతల చంద్రారెడ్డి, రంగాశ్రీకర్, రాంమూర్తి, నర్సయ్య, అలంపల్లి నర్సింహ, రాంరహీం, పేలపూడి బాలకృష్ణ, రాజారమేష్‌యాదవ్, శ్రీనివాస్, రమేష్, మహేందర్, ఆలయ కమిటీ సభ్యులు వర్కాల సుధాకర్‌రెడ్డి, రేపాల వెంకన్న, వెంపటి శ్రీనివాస్, నిమ్మల లక్ష్మారెడ్డి, చిననారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ అందరి ఆరాధ్య దైవం



సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జానారెడ్డి, రఘువీర్‌రెడ్డి, కోటిరెడ్డి, జైవీర్‌రెడ్డి

హాలియా, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సంత్‌సేవాలాల్ మహరాజ్ గిరిజనుకే కాదు అందరి ఆరాధ్య దైవమని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హాలియాలో ఆదివారం నిర్వహించిన సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఆయన హాజరై మాట్లాడారు. సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను రాష్ట్రంలో తప్ప వేరే ప్రాంతాల్లో నిర్వహించడం లేదని ఇది తెలంగాణ ప్రభుత్వం గొప్పతనమని పేర్కొన్నారు. ప్రతీ గిరిజనుడు సంత్‌సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో నడవాలని, జాతి యొక్క జీవన ప్రమాణాలు పెరగాలి, బాగుండాలని సేవాలాల్ అనునిత్యం కోరుకున్నారని తెలిపారు. బంజారాలు అంటే నాడు బ్రిటీష్‌కు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యవంతులని కొనియాడారు. ప్రభుత్వం అన్ని కులాలు, మతాలను గౌరవిస్తూ, సంప్రదాయాలను, ఆచారాలను కాపాడుతుందని అన్నారు. అంతకు ముందు హాలియా ప్రధాన వీధుల్లో భారీగా ర్యాలీలు నిర్వహించారు. లంబాడీ మహిళల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, గిరిజన నాయకులు ఆంగోతు భగవాన్‌నాయక్, రామచంద్రనాయక్, బాబురావునాయక్, శంకర్‌నాయక్, సైలాబ్‌నాయక్, రమావత్ రవికుమార్‌నాయక్, సక్రునాయక్, బిక్షనాయక్, పాండునాయక్, ప్రసాద్‌నాయక్, కొర్ర శంకర్, మోతీలాల్, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, గిరిజన నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



కొండమల్లేపల్లిలో గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

నాగార్జునసాగర్, కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 5వ తరగతి, 6 నుంచి 10వ తరగతి వరకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం నాగార్జునసాగర్, కొండమల్లేపల్లిలో ప్రశాంతంగా ముగిసింది.

నాగార్జునసాగర్ హిల్‌కాలనీ బీసీ గురుకుల పాఠశాలలో ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. మొత్తం 239 మంది విద్యార్థులకు 237 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొత్తం 377 మంది విద్యార్థులకు గాను 368 మంది హాజరయ్యారని, అలాగే ఎస్సీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 714 మందికి గాను 699 మంది హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు తెలియజేశారు.



సాగర్‌లో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు

ప్రపంచానికి ఇంధనమే చోదకశక్తి



వినియోగదారులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి ఇంధనమే చోదకశక్తని, ఇంధన పొదుపును ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ జిల్లా సేల్స్ ఆఫీసర్ దిలీప్‌నాయక్ అన్నారు. కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశాల మేరకు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిలాజ ఇంధనాలను పొదుపు చేస్తూ పునరుత్పాదక వనరుల వినియోగం పెంచాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ఇంధనంలో సింహభాగం బొగ్గు, ముడి సరుకులేనన్నారు. పర్యావరణ పరిరక్షణకు శిలాజ ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మితిమీరిన వాహన వినియోగంతో ప్రకృతికి చేటు జరగడంతో పాటు ఇంధన వనరులు కరిగిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం వెలువడుతున్న కాలుష్యంతో పర్యావరణంతో పాటు ప్రజారోగ్యానికి ప్రమాదం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లుగా హరిత ఇంధనోత్పత్తిని పెంచుకోవాలన్నారు. అందుకు కేంద్రప్రభుత్వం సహకరిస్తుందని, ఇంధన పొదుపు చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రజా రవాణా సాధనాలను వినియోగించుకోవాలని, చిన్నపాటి అవసరాలకు కాలినడక లేదా సైకిల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఇంధన పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీలర్లు గుంటూరు రామారావు, సీహెచ్ మధు, పర్యావరణ పరిరక్షణ సభ్యులు, డెలివరీ బాయ్స్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలకు చెందిన 2005-06 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని సాగర్ రోడ్డులోని ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన పూర్వ విద్యార్థులను సన్మానించారు. అనంతరం తమ పాఠశాల అనుభవాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వడ్డేపల్లి చంద్రారెడ్డి, తంగెళ్ల వెంకట్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ



మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భగత్, నాయకులు

నిడమనూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు షేక్ సలీం తండ్రి సయ్యద్‌హుస్సేన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆదివారం పార్టీ నాయకులతో మండలంలోని ముకుందాపురంలో ఆయన నివాసానికి వెళ్లి మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని రాజన్నగూడెం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు జంగిలి శ్రీనివాస్ యాదవ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపి కుటుంబసభ్యులను ఓదార్చారు. మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రావుల ఆంజనేయులు తండ్రి మారయ్య ఇటీవల మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను భగత్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బొల్లం జయమ్మ, కూరాకుల వెంకటేశ్వర్లు, రాంఅంజయ్య, బొల్లం రవి, కేశ శంకర్, మెరుగు రామలింగయ్య, బొల్లం సైదులు, జానిమియా, ఆదిముళ్ల భాస్కర్, సురభి రాంబాబు, నల్లగొండ సుధాకర్, శివ, కత్తి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బాలునాయక్ మృతి పార్టీకి తీరని లోటు



బాలునాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తనందికొండ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రమావత్ బాలునాయక్ (55) మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. బాలునాయక్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ఆదివారం గ్రామానికి చేరుకొని బాలునాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన బాలునాయక్ పార్టీకి చేసిన సేవలను, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. అదేవిధంగా డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ బాలునాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట దుగ్గంపూడి నారాయణరెడ్డి, ధనావత్ చిట్టిబాబునాయక్, ఆంగోతు హతీరాంనాయక్, కుర్ర సేవ్యానాయక్, కుర్ర శ్రీనునాయక్, ముత్యాలు, స్వామినాయక్, కుర్ర కాంతికృష్ణకాంత్, పకీరానాయక్, చిన్ననాయక్, రామకోటినాయక్, ముని, బాల, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

మర్రిగూడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు అండర్ -14 విభాగంలో మర్రిగూడ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ రమేష్ తెలిపారు. హైదరాబాద్‌లోని తుర్కయాంజల్ ప్రో కబడ్డీ నిర్వాహకుల సహకారంతో ఇండియన్ ఒలంపిక్ కమిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అండర్ -14 కబడ్డీ విభాగంలో నిర్వహించిన పోటీల్లో వారు ప్రతిభ చాటారు. వారిని జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. వచ్చే నెల చెన్నైలో జరిగే ఆల్ ఇండియా కబడ్డీ నేషనల్ ఛాంపియన్ పోటీలకు వెళ్లనున్నట్లు తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థి గణేష్, అఖిల్, నితిన్‌లతో పాటు జడ్పీ హైస్కూల్ విద్యార్థి వెళ్లనున్నట్లు కోచ్ రమేష్ తెలిపారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది.



జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో రమేష్